రాబోవు ఎన్నికలకు 'మేం సిద్ధం'


సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు


మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : రాబోవు సార్వత్రిక ఎన్నికలకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు తాము సిద్ధంగా ఉన్నామని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా తెలిపారు. శనివారం స్థానిక అపూర్వ ఫంక్షన్ హాలులో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్ బాబు, ఎమ్మెల్సీ ఎంపీ రామచంద్రారెడ్డిలతో కలిసి కడప నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి ఒక్కరికి ఇంటివద్దకే సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్న ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తు.చ తప్పకుండా అమలు చేశారన్నారు. తమ ప్రభుత్వం ప్రజలకు ఈ పథకాల ద్వారా మేలు చేసిందని గర్వంగా చెప్పుకునేలా వైఎస్సార్‌సీపీ పాలన ఉందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టి, నాడు–నేడు ద్వారా పాఠశాలలు, ఆసుపత్రుల రూపురేఖలను పూర్తిగా మార్చివేశారన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కార్యకర్తలంతా సమిష్టిగా కృషి చేయాలన్నారు. ప్రజలకు మంచి చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మళ్లీ గెలిపించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి జగనన్న సూచన మేరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తలపెట్టబోయే ప్రతి కార్యక్రమాన్ని జయప్రదం చేద్దామని డిప్యూటీ సీఎం కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, టీటీడీ బోర్డు సభ్యులు మాసీమ బాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మెన్ పులి సునీల్, పి. జయచంద్రారెడ్డి, ఎన్. సుబ్బారెడ్డి, షఫీ, దాసరి శివ ప్రసాద్, సీహెచ్ వినోద్, రత్నకుమారి, టీపీ వెంకట సుబ్బమ్మ, బండి మరియలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు


విశేష అలంకారంలో శ్రీ కాలభైరవస్వామి

కడప కల్చరల్ : కడప నగర సమీపంలోని ఎంఎస్ కొట్టాల గ్రామంలో శనివారం శ్రీ ఇష్టకామ్యార్థ కాలభైరవస్వామి ఆలయంలో కాలభైరవాష్టమి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. మాసోత్సవం సందర్భంగా అర్చకులు శ్రీధర్‌శర్మ తొలుత మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. అనంతరం స్వామికి విశేష అలంకారం చేశారు. ఆలయ వెలుపల భక్తులు ప్రత్యేక పూజలను సామూహికంగా నిర్వహించారు. భక్తులు కుష్మాండ దీపాలతో స్వామికి హారతులు పట్టారు.

హెల్మెట్ తప్పక ధరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ కె.గోపినాథ్ తెలిపారు. రాయల్ రషీద్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనల పత్రాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు నడిపే యువత వేగంగా నడుపుతుంటారని, ఏదైనా ప్రమాదం జరిగినపుడు మృతి చెందే అవకాశం ఉందన్నారు. ఉద్యోగులు, ప్రజలు హెల్మెట్ ధరించి వాహనాన్ని నడపాలని సూచించారు.

అధిక ఫీజు వసూళ్లు ఆపండి

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్స్ పేరుతో విద్యార్థులు, తల్లిదండ్రులనుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి జి.శ్రీనాథ్‌యాదవ్ కోరారు. ఈ మేరకు శనివారం ఆర్‌ఐఓ వెంకట సుబ్బయ్యకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర ఉపాధ్యక్షులు అల్లాబకష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

హంతకులకు శిక్షించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : విశాఖపట్టణం తహసీల్దార్ రమణయ్యను దారుణంగా హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఏపీఆర్‌ఎస్‌ఏ కడప డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ప్రసాద్‌రావు, ఎ.రంగనాథ్‌లు తెలిపారు. శనివారం సాయంత్రం ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో నల్లబ్యాడ్జీలు ధరించి రమణయ్య ఆత్మ శాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. వారు మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగులు విధి నిర్వహణలో తీవ్ర ఒత్తిడితో ఉంటారని, అలాంటి వారి సమస్యలను అర్థం చేసుకోవాలన్నారు. సమస్యలను చర్చలతో పరిష్కరించుకోవాలే తప్ప హతమార్చడం ఏమాత్రం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ తిరుమలబాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఆధ్వర్యంలో..

విశాఖ తహసీల్దార్ రమణయ్య హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా నాయకులు తెలిపారు. అధిక భూవివాదాలు ఉన్న మండలాల తహసీల్దార్లు, వీఆర్వోలకు ప్రభుత్వం ప్రత్యేక రక్షణ కల్పించాలని కోరుతున్నామన్నారు.

భాషపై పట్టు సాధించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలో ఉన్న కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆంగ్ల ఉపన్యాస పోటీలు జమాత్ ఉస్ సలిహత్ మాదర్సా విద్యార్థులకు నిర్వహించారు. వారు వివిధ అంశాల మీద విద్యార్థులకు ఉపన్యాసాలు ఇచ్చారు. ఇందులో ముఖ్య అతిథిగా మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ మొహమ్మద్ సికందర్ హుస్సేన్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఉర్దూ, తెలుగుతో పాటు ఇంగ్లీష్ అవశ్యకత ఎంతో ఉందన్నారు. విద్యార్థులు భాష మీద పట్టు సాధించాలి అంటే ఇలాంటి ప్రోగ్రాం వల్ల సాధ్యమవుతుందన్నారు. భావవ్యక్తీకరణ భాషే ప్రధానం అన్నారు. సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ ఎఫ్ఎమ్ ముఖ్తర్ అహ్మద్, గౌసులాజం, మౌలానా అక్బర్ అలీ రాషాది పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సత్కారం

కడప కోటిరెడ్డిసర్కిల్ : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అనంతపురం జిల్లాకు బదిలీపై వెళుతున్న కడప తహసీల్దార్ శివరామిరెడ్డిని కడప నగర మేయర్ ఘనంగా సత్కరించారు. శనివారం సాయంత్రం మేయర్‌ను తహసీల్దార్ శివరామిరెడ్డి ఆయన చాంబర్‌లో కలిశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్‌చంద్, కార్పొరేటర్ పాకా సురేష్, బాలస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ మహాసభను విజయవంతం చేయండి

పెండ్లిమర్రి : కడప నగర శివారులోని డీఎస్‌ఆర్ ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించే కమలాపురం నియోజకవర్గ యాదవుల ఆత్మీయ మహాసభను విజయవంతం చేయాలని జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య పిలుపునిచ్చారు. శనివారం పెండ్లిమర్రిలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.

వైవీయూలో పలు విభాగాల తనిఖీ

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయంలో పలు విభాగాలను శనివారం విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నియంత్రణ అధికారి పర్యవేక్షణలో జరుగుతున్న డిగ్రీ పరీక్షల మూల్యాంకన కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం సైన్స్ బ్లాక్‌లో బయో టెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్స్, ఎన్విరాన్మెంటల్ సైన్స్ విభాగ తరగతి గదులకు వచ్చారు. విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. సైన్స్ బ్లాక్ లో పలు విభాగాల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఇంజనీరింగ్ విభాగాన్ని పరిశీలించి రికార్డులను చూసి అధికారులకు పలు సూచనలు చేశారు.

వయో పరిమితి పెంచాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : డీఎస్సీ అభ్యర్థుల వయో పరిమితి 47 సంవత్సరాలకు పెంచాలని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం. ఓబులేసు పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీఎస్సీ ప్రతిపాదనను మంత్రి మండలి ఆమోదించడం హర్షణీయమన్నారు. నోటిఫికేషన్ నాటి నుంచి జూన్ వరకు రిటైర్డ్ అవుతున్న ఉపాధ్యాయుల సంఖ్య ఇందులో చేర్చి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి


మార్నింగ్ విజిట్‌లో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : కడప నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్ చంద్ అన్నారు. శనివారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా అల్మాస్‌పేట జంక్షన్, గోకుల్ జంక్షన్, క్రిష్ణా జంక్షన్, అన్నమయ్య జంక్షన్, దేవుని కడప రోడ్డు, మాసాపేట జంక్షన్, అంబేద్కర్ సర్కిల్– వై జంక్షన్, వై జంక్షన్– అప్సర సర్కిల్ డ్రైనేజీ నిర్మాణ పనులను సంబంధిత ఆర్ అండ్ బి శాఖ అధికారులు ఇంజనీరింగ్ విభాగ అధికారులతో కలిసి పరిశీలించారు.

అల్మాస్ పేట జంక్షన్ నిర్మాణ పనులలో భాగంగా జరుగుతున్న పనులను పరిశీలిస్తూ జంక్షన్‌లో స్టోన్ కటింగ్ పనులను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని, ఫౌంటెన్ ఏర్పాటుకు సామాగ్రిని సిద్ధం చేసుకోవాలన్నారు. గోకుల్ మార్గంలో పెయింటింగ్ పనులు వెంటనే చేయించాలన్నారు. రాత్రివేళ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జంక్షన్ లో హైమాస్ వీధి దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. అన్నమయ్య జంక్షన్ మధ్యలో ఉన్న ఆక్రమణలను తక్షణం తొలగించాలన్నారు. దేవుని కడప రోడ్డులో డ్రైనేజీ పై స్లాబ్ ఏర్పాటు చేయాలని, మాచుపల్లి జంక్షన్ వద్ద ఎలక్ట్రికల్ వర్క్ పనులను తక్షణమే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక అధికారులు, ఆర్‌అండ్‌బి అధికారులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ ద్వారా కడప డిపోలో ఇస్తున్న డ్రైవింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డీపీటీఓ పోలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం 19వ బ్యాచ్ అడ్మిషన్స్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు 10–15 కిలోమీటర్ల మేర బస్సును నడిపిస్తున్నారని, వీడియో విజువల్స్ ద్వారా ప్రమాదాలు జరిగే తీరు గురించి, వాటి నివారణ గురించి తెలియజేస్తారన్నారు. అలాగే గ్యారేజీలో సుదీర్ఘ అనుభవం కలిగిన మెకానిక్‌లచే వాహన విడిభాగాలను చూపుతూ వాటి పనితీరును తెలియజేస్తారన్నారు. డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు, ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

వైవీయూ వైస్ ప్రిన్సిపాల్‌గా ఆచార్య షావల్లీఖాన్


ఆచార్య పి.షావల్లీఖాన్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, చీఫ్ సూపరింటెండెంట్ ఆఫ్ ఎక్స్‌టెర్నల్ ఎగ్జామినేషన్స్‌గా వృక్షశాస్త్ర ఆచార్యులు డా. పి. షావల్లీఖాన్ నియమితులయ్యారు. వైస్ ఛాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య శనివారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో పనిచేసిన ఆచార్య టి. శ్రీనివాస్ పదవీకాలం పూర్తవడంతో ఈ నియామకం చేపట్టారు. వైస్ ప్రిన్సిపాల్ బాధ్యతలతో పాటు విశ్వవిద్యాలయ బాలుర, బాలికల వసతిగృహాల అదనపు చీఫ్ వార్డెన్ బాధ్యతలు నిర్వహించాలని నియామక ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, ఆచార్య టి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ రిటైల్ మేళాకు స్పందన


రీటైల్ మేళాలో పాల్గొన్న బ్యాంకు అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో శనివారం కడప నగరం ఏడురోడ్ల కూడలిలోని బ్యాంకు ఆవరణలో నిర్వహించిన రీటైల్ మేళాకు ప్రజల నుంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రీజనల్ మేనేజర్ మురళి మోహన్ మాట్లాడుతూ కెనరా బ్యాంక్‌లో అతి తక్కువ, ఆకర్షణీయమైన వడ్డీ రేట్లకు హౌసింగ్ లోన్స్ అందించడం జరుగుతుందన్నారు. ప్రాసెసింగ్, డాక్యుమెంటేషన్ చార్జెస్ లో రాయితీ మార్చి 31 వరకు పొడిగించడం జరిగిందన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పథకాల కొనసాగింపు జగనన్నతోనే సాధ్యం


కొత్తగాలివారిపల్లె ప్రచారంలో వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి

వల్లూరు : దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, వాటి కొనసాగింపు ఆయనతోనే సాధ్యమని వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్, మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని బాకరాపురం, కొత్తగాలివారిపల్లె గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటసుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటసుబ్బారెడ్డి, ఉప సర్పంచ్ కాంతమ్మ, పార్టీ నేతలు ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, మస్తాన్, పుల్లయ్య పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి


సురేష్ కుమార్ మృతదేహం

కడప కోటిరెడ్డి సర్కిల్: అహ్మదాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్తున్న రైలు నుంచి జారిపడి సురేష్ కుమార్ (40) అనే వ్యక్తి మృతి చెందాడని కడప రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగరాజు నాయక్ తెలిపారు. ఆయన కథనం మేరకు సురేష్ కుమార్ రాజస్థాన్ నుంచి అనంతపురం వెళ్లేందుకు రైలు ఎక్కాడు. ఇతను అనంతపురంలో దిగాల్సి ఉండగా గుంతకల్ నుంచి ఈ రైలును అధికారులు దారి మళ్లించారు. దీంతో అతను ఈ రైలు కడపలో కూడా నిలబడదేమో అనే ఉద్దేశంతో కదులుతున్న రైలు నుంచి దిగే ప్రయత్నంలో జారిపడి రెండు కాళ్లు విరిగాయి. ప్లాట్‌ఫాం మధ్యలో ఇరుక్కుపోయాడు. వెంటనే కడప రిమ్స్‌కు తరలించగా అక్కడ మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేశామన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కడప రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గత మూడేళ్లుగా జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్‌లను రద్దు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప రూరల్ సబ్ రిజిస్ట్రార్ పరిధిలో మూడేళ్ల నుండి జరిగిన రిజిస్ట్రేషన్ లపై విచారించి అక్రమ రిజిస్ట్రేషన్‌లను రద్దు చేసి అక్రమాలకు పాల్పడిన సంబంధీకులపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కడప కోటిరెడ్డిసర్కిల్ : వాస్కోడిగామా నుంచి తిరుపతికి వెళుతున్న రైలులోగల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్టుచేశామని కడప రైల్వే సీఐ నాగార్జున తెలిపారు. శనివారం కడప రైల్వేస్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కడప రైల్వేస్టేషన్‌లో ప్రయాణీకుల వస్తువుల సోదాలు నిర్వహించామన్నారు. వాస్కోడిగామా నుంచి తిరుపతికి వెళుతున్న రైలులో ఒక వ్యక్తి కడప రైల్వేస్టేషన్‌లో దిగారన్నారు. అతని బ్యాగును తనిఖీ చేయగా 10 మద్యం బాటిళ్లు ఉన్నాయన్నారు. ఈ మేరకు బాటిళ్లను సీజ్ చేయగా, వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించామన్నారు.

12 నుంచి క్రికెట్ టోర్నమెంటు

కమలాపురం : స్థానిక సీఎస్ఐ చర్చి గ్రౌండ్‌లో ఈనెల 12వ తేదీ నుంచి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్స్ సునీల్, దినకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు వరుసగా రూ.50 వేలు, రూ.30వేలు నగదు బహుమతులు అందజేస్తున్నట్లు వారు తెలిపారు. క్రీడాకారులు రూ.1100 ఎంట్రీ ఫీజు చెల్లించి తమ జట్ల పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 79951 28196, 82476 44591 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

డైరీ ఆవిష్కరణ


డైరీ ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ క్లాస్–2 సూపర్‌వైజర్ల అసోసియేషన్ డైరీని ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి శనివారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. చైర్మన్ మాట్లాడుతూ సూపర్‌వైజర్లకు సంబంధించి అన్ని అంశాలు డైరీలు పొందుపరిచారని, ఆయా ఉద్యోగులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉద్యోగులు సంస్థకు వారధులు


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు

ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగులు సంస్థకు వారధుల్లాంటి వారని కడపజోన్ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం ఆర్టీసీ అధికారులు రూపొందించిన డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎం గోపాల్‌రెడ్డి, డిప్యూటీ సీపీఎం గజలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన


నృత్యాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

కడప కల్చరల్ : ఆధ్యాత్మిక సాధనకు సంగీత నృత్యాలకు మించిన మార్గం లేదని, ఈ పరంపరను వేదకాలం నుంచి కొనసాగిస్తుండడం భారతావనికే సాధ్యమైందని శ్రీ లలితా పంచాయతన ఆలయ నిర్వాహకులు, చిన్మయమిషన్ కడప శాఖ అధ్యక్షులు స్వామి తురియానంద అన్నారు. శనివారం నగర శివార్లలోని శ్రీ లలితా పంచాయతన ఆలయంలో 'ఆయన' పేరిట పరంపర నృత్య బృందం తమ అంతర్జాతీయ స్థాయి శాస్త్రీయ నృత్య ప్రదర్శనతో నగర వాసులకు కనుల పండువ చేశారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ ఈ అద్భుతమైన నృత్యప్రదర్శనకు అమ్మవారి ఆలయం వేదిక కావడం విశేషమన్నారు. నృత్య కళ ద్వారా ఆధ్యాత్మిక చింతనను ప్రేరేపించేలా నిర్వహించిన ఈ కార్యక్రమంలో తొమ్మిది మంది కళాకారులు నవరత్నాల్లా మెరిశారు. దాదాపు రెండు గంటలపాటు దక్షిణాదితోపాటు ఉత్తరాది సంగీత నృత్య శైలిలో సాగిన ఈ ప్రదర్శన అంతర్జాతీయ స్థాయిలో ఉండడంతోపాటు లైటింగ్, రీతుల కూర్పు, డీజే సిస్టమ్ అన్నీ వినూత్నంగా ఉండి ఆకర్షించాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు స్థానిక అతిథులతో కలిసి కళాకారులను సత్కరించారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జగనన్న పాలన


'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని, ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు సంతృప్తిగా అందుతున్నాయని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. శనివారం స్థానిక 37వ డివిజన్‌లోని అగాడి, వక్కలపేట ప్రాంతాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని తెలుసుకున్నారు. ఇంకా అర్హులెవరికైనా పథకాలు అందలేదా అని ఆరా తీశారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంతకంతో కూడిన బుక్‌లెట్‌ను వారికి అందజేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా అంజద్‌బాషా మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం నవరత్నాల పథకాలను ప్రవేశపెట్టి ఎటువంటి అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా అమలు చేస్తున్నారన్నారు. దేశంలో ఇన్ని రాష్ట్రాలు ఉన్నా ఇంత గొప్పగా పేదల గురించి ఆలోచించి సంక్షేమ పథకాలు అమలు చేయలేదన్నారు. సంవత్సరంలో ప్రతినెల క్యాలెండర్ పద్ధతిలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని కొనియాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా నూతన సచివాలయ వ్యవస్థను తీసుకుని వచ్చి వాలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలను ఇంటి ముంగిటకు చేర్చామన్నారు. ఈ సందర్భంగా షేక్ అన్సారి అనే మహిళ మాట్లాడుతూ జగనన్న ఇంటి స్థలం, వైఎస్సార్ చేయూత, పథకాల ద్వారా తమకు రూ.9.51లక్షల మేలు జరిగిందని సంతోషం వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో హరూన్ గ్రూప్స్ ఎండీ అహ్మద్‌బాషా, 37వ డివిజన్ ఇన్‌చార్జి బసవరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పి. జయచంద్రారెడ్డి, బంగారు నాగయ్య, షఫీ, మియ్యా, ఎన్. సుబ్బారెడ్డి, తోటక్రిష్ణ, రామమోహన్‌రెడ్డి, రహీం, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేఎస్‌ఆర్‌ఎంకు స్టూడెంట్ చాప్టర్ అవార్డ్



అవార్డును అందుకుంటున్న చంద్ర ఓబుల్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఇండియన్ కాంక్రీట్ ఇనిస్టిట్యూట్, అల్ట్రాటెక్ సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా ఐసీఐ–అల్ట్రాటెక్ అవార్డ్స్ 2023ను ప్రకటించింది. ఇందులో భాగంగా కడపలోని కేఎస్‌ఆర్‌ఎం కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌కు ఈ అవార్డు అందజేశారు. తమ కళాశాలకు 2023కు బెస్ట్ స్టూడెంట్స్ చాప్టర్ అవార్డు లభించిందని కేఎస్‌ఆర్‌ఎం ప్రిన్సిపల్ మూర్తి తెలిపారు. కెఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.చంద్ర ఓబుల్ రెడ్డి విజయవాడలో పీవీపీ సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విజయవాడ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శివాజీబాబు, ఐసీఐ ఏపీ చాప్టర్ చైర్మన్ ప్రొఫెసర్ జగదీష్ వెంగళ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు.